# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

JUNE - 2009

సంవత్సర చందా రూ. 50/-

# ప్రకటన గ్రంథ వ్యాఖ్యానము

సత్యవాక్కులో గత 34 మాసములుగా (2006 ఆగస్టు నుండి 2009 మే నెలవరకు) ప్రకటన గ్రంథ ప్రసంగమాలికను ప్రచురించుచు వచ్చాము. ప్రకటన గ్రంథములోని 22 అధ్యాయాలు అందు చక్కగా వివరించబడి యున్నవి.

జాషువా గూటం గారు ఈ గ్రంథముపై క్రీస్తు సంఘములో అమెరికాలో యున్న అనేక బైబిలు పండితులు వ్రాసిన వ్యాఖ్యానములు చదివి, వాటిని క్రోడీకరించి ఆంధ్రలో యున్న బోధకులు తమ స్థానిక సంఘములకు ఉపదేశించుటకు వీలుగా యుండునట్లు ఈ ప్రసంగ మాలికలను తయారుచేసి ప్రచురిస్తు వచ్చారు. ఇప్పుడవన్నీ ఒక పుస్తక రూపమున ముద్రించాలని అనేకులు ఉత్తరాలు ద్వారా , ఫోన్ల ద్వారా తెలియజేయుచున్నారు గాన వారి కోరిక మేరకు విశ్వాసముతో ఆపనిలో నిమగ్నులమైయున్నాము. అది గ్రంథ రూపములో ఇంకొక రెండు వారములలో లభించగలదు. ఒక్కొక్క కాపీ కనీసం 60-రూ॥లు కావచ్చును. గనుక దానికొరకు వేచి యుండండి, దానిమూల్యమును సేకరించుకొనండి. ప్రకటన గ్రంథ ప్రసంగ మాలిక సిద్ధమవగానే మీకు తెలియజేయుదుము. అప్పుడు మీరు డబ్బు పంపించి, మీ కాపీని పొంద వచ్చును.

– ఎడిటర్

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada,A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 29 | జూన్ 2009 | సంచిక -11


## మత్తయి 24వ అధ్యాయము
## విశ్లేషణ - వ్యాఖ్యానము
## (Exegesis of Matthew 24)

బైబిలు అంతటిలోను 1189 అధ్యాయములున్నాయి. క్రొత్త నిబంధనలో 260 అధ్యాయములున్నాయి. అయితే మత్తయి సువార్త 24వ అధ్యాయము మాత్రము క్రైస్తవలోకంలో గందరగోళం సృష్టించు అధ్యాయముగ యున్నది. దీనిని సరిగ అర్థము చేసికొను వారికంటె అపార్థము చేసికొన్న వారే ఎక్కువయని నా అభిప్రాయము. ఈ అధ్యాయములో చెప్పబడిన వాటిని బట్టి అబద్ధ బోధకులు అనేక అబద్ధ సిద్ధాంతములను ప్రవేశపెట్టారు. ఈ అధ్యాయములో ప్రభువు చెప్పిన సూచనలను బట్టి ఆయన రెండవ రాకడ యొక్క సమయాన్ని నిర్దేశించుటకు వారు ప్రయత్నిస్తారు. వెయ్యేండ్ల పాలన సిద్ధాంతాన్ని బోధించేవారు కూడా వారి సిద్ధాంతాన్ని నిరూపించడానికి మత్తయి 24వ అధ్యాయాన్ని ఉపయోగిస్తారు.

అందువలన మత్తయి 24వ అధ్యాయము యేమి చెప్పుచున్నదో తెలిసి కొనుటకు దానిని మనం జాగ్రత్తగా చదవాలి. ఆ అధ్యాయాన్ని జాగ్రత్తగా చదివితే

దానిలోని ప్రాముఖ్యాంశములను ఈ దిగువ రీతిలో మనం గమనించవచ్చును.

1. మత్తయి 24వ అధ్యాయము యూదా జనాంగమునకు వ్యతిరేకముగా చేయబడిన ప్రవచనములలో శిఖరాగ్రమునకు చేరినట్టిది
2. మత్తయి 24:34 కీలకమైన వచనము.
3. మత్తయి24:36 అవస్థాంతర ప్రాప్తి సంబంధమైన (Transitional) వచనము.
4. మత్తయి 24:1-3లో శిష్యులు యేసును కొన్ని ప్రశ్నలడుగుదురు.
5. మత్తయి 24:4-14 మోసపరచు సూచనలను గూర్చి హెచ్చరికలు.
6. మత్తయి 24:15- 28 యెరూషలేము నాశనము గావించబడక ముందు కనబడు యదార్థ సూచన.
7. 29-35 వచనములు ప్రవచనాత్మక అలంకార భాష
8. 36-44 వచనములు లోకాంతమును గూర్చి
9. 45-51 వచనములు నమ్మకమైన బుద్ధిగల దాసుని గూర్చిన ఉపమానము.
10. యెరూషలేము నాశనములో ప్రభుని రాకడ యొక్కయు, అయన చివరి రాక యొక్కయు సంగ్రహణ (Summary)
11. "వెయ్యేండ్ల పాలన" సిద్ధాంతము పునర్విమర్శనము.
2. ముగింపు.

పైన చెప్పబడిన అంశములను ఒక్కొక్క దానిని ఇప్పుడు విశ్లేషించుదాం :

## 1. మత్తయి 24వ అధ్యాయము యూదా జనాంగమునకు వ్యతిరేకముగా చేయబడిన శిఖరాగ్ర ప్రవచనము

బాప్తిస్మము ఇచ్చు యోహాను "ఇప్పుడే గొడ్డలి చెట్ల వేరున ఉంచబడి యున్నది" యని యూదులను హెచ్చరించాడు (మత్తయి 3:10). యేసు కూడా రాబోవు తీర్పును గూర్చి యూదులకు అంతకంటే తీవ్రముగ హెచ్చరించారు(మత్తయి 23:33). వారు మారుమనస్సు పొందలేదు. ఆ గొడ్డలి ఎట్లు వారిమీద పడునో మత్తయి 24 అధ్యాయము తెలియజేయుచున్నది.

మత్తయి 21వ అధ్యాయములో యూదులు దేవుని రాజ్యమును ఎట్లు స్వతంత్రించు కొనలేరో యేసు తెలియజేసెను. ఒక మనుష్యునికున్న ఇద్దరు కుమారులను గూర్చిన

ఉపమానములో యేసు యూదులను నిశితముగా ఖండించెను. "యేసు-సుంకరులును వేశ్యలును మీకంటె ముందుగా దేవుని రాజ్యములో ప్రవేశించుదురని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని" వారితో అనెను (మత్తయి 21:28-32). దుర్మార్గులైన ద్రాక్షతోట కాపులను గూర్చిన ఉపమానములో యూదులతో యేసు, "దేవుని రాజ్యము మీ యొద్దనుండి తొలగింపబడి దాని ఫలమిచ్చు జనులకియ్యబడునని మీతో చెప్పుచున్నాను. మరియు ఈ రాతిమీద పడువాడు తునకలై పోవునుగాని అది ఎవని మీద పడునో వానిని నలిచేయుననెను. ప్రధాన యాజకులును పరిసయ్యులును ఆయన చెప్పిన ఉపమానములను విని తమ్మును గూర్చియే చెప్పెనని గ్రహించిరి" (మత్తయి 21:33-45).

యూదులకును యేసుకును మధ్య జరిగిన చివరి వాగ్వివాదము మత్తయి 22లో వ్రాయబడియున్నది. కైసరుకు పన్నిచ్చుటను గూర్చి ఆయన యిచ్చిన జవాబులో ఆయన పరిసయ్యుల యొక్కయు, హేరోదీయుల యొక్కయు నోరు మూయించెను. "వారీ మాట విని ఆశ్చర్యపడి ఆయనను విడిచి వెళ్లిపోయిరి" (మత్తయి 22:22). పునరుత్థానమును గూర్చి సద్దూకయ్యులు వేసిన ప్రశ్నకు జవాబిచ్చి ఆయన వారి నోళ్ళు మూయించెను (మత్తయి 22:23-33). తరువాత ఆయనను శోధించుటకు పరిసయ్యులు ఒక ధర్మశాస్త్రోపదేశకుని ఆయన దగ్గరకు పంపించారు (34-35వచ). అయితే యేసు వారినే ఒక ప్రశ్న వేయగా వారు తెల్లబోయిరి! సరిగదా వారిలో "ఎవరును మారుమాట చెప్పలేకపోయెను. మరియు ఆ దినమునుండి ఎవడును ఆయనను ఒక ప్రశ్నయు అడుగ తెగింపలేదు" (మత్తయి 22:46).

మత్తయి 23వ అధ్యాయములో యేసు యూదా జనాంగము యొక్క పాపములను సంగ్రహించి చెప్పి దానిపై ఆయన తన తీర్పును ప్రకటించెను: "ఇదిగో మీ యిల్లు (పాడైపోయి) మీకు విడువబడి యున్నది" (23:38). ఆయన వారి పాపములను వరుసగా ఖండించెను (23:15-35). 23:32లో " మీరును మీ పితరుల పరిమాణమును పూర్తి చేయుడని" వారికి చెప్పెను. వారి పితరులు ప్రవక్తలను చంపిరి, హింసించిరి (23:24) వారి పాపముల గిన్నె నిండిపొర్లునట్లు యుందురు, గనుక భూమిమీద చిందింపబడిన నీతిమంతుల రక్తమంతయు వారిమీదికి వచ్చును. "ఇవన్నియు ఈ తరము వారి మీదికి వచ్చునని నిశ్చయముగా మితో చెప్పుచున్నాను" అని యేసు చెప్పెను (23:35,36). యోరూషలేములోని దేవాలయము ఇకమీదట "నా మందిరము" కాదు (21:13). గాని అది "మీయిల్లు" (23:38). దేవుడు

దాన్ని విసర్జింజేసారు అని చెప్పి యేసు దేవాలయము నుండి బయలు దేరి వచ్చేసారు (24:13).

## మత్తయి 24:34 కీలక వచనము

"ఇవన్నియు జరుగువరకు ఈ తరము గతింపదని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (24:34). మత్తయి 24వ అధ్యాయమును సరిగ విభజించి అర్థము చేసికొనుటకు గాను ఈ వచనమును సరిగ అర్థము చేసికొనాలి. ఈ వచనమునకు ముందు చెప్పబడినవన్నియు గ్రహించుటకు "ఈ తరము" అను మాట కీలకమైనది. తరము అను మాట ఒక కాలమందు జీవించుచున్న వారిని సూచించుచున్నది.

మత్తయి సువార్త అంతటిలోను "తరము" అనే పదాన్ని అతడెట్లు పయోగించాడో తెలియనగును. మత్తయి 1:17లో తరము అనే పదాన్ని అబ్రాహాము నుండి క్రీస్తు వరకు సగటు వయో పరిమాణము. మత్తయి 11:15లో యేసు "ఈతరము వారిని దేనితో పోల్చుదును? " అని యడిగినప్పుడు ఆయన కాలములో జీవించి యున్న వారిని గూర్చి చెప్పెను. మత్తయి 12:38-45లో తన కాలమునాటి ప్రజలనుద్దేశించి "తరము " అను మాట నాలుగు మారులు ఆయన వినియోగించారు. "వ్యభిచారులైన చెడ్డతరమువారు సూచకక్రియను అడుగుచున్నారు". "విమర్శ సమయమున నీనెవె వారు ఈ తరము వారితో నిలువబడి వారిమీద నేరస్థాపన చేతురు". "దక్షిణదేశపు రాణి ఈ తరమువారితో నిలువబడి వారిమీద నేరస్థాపన చేయును". "ఆలాగే యీ దుష్ట తరము వారికి సంభవించును". ఈ లేఖన భాగములన్నింటిలోను, మత్తయి 24:34లో వలె యేసు కాలము నాడు జీవించియున్న యూదులనుద్దేశించి ఆయన బోధించెననుట నిర్వివాదాంశము.

## మత్తయి 24:36 అవస్థాంతర (Transition) వచనము

"అయితే ఆదినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే యెరుగును గాని, యే మనుష్యుడైనను పరలోకమందలి దూతలైనను కుమారుడైనను ఎరుగరు" (24:36). ఈ వచనము 24వ అధ్యాయమును రెండు భాగములుగ విభజించుచున్నది. మొదటి భాగం మత్తయి 24:4-35 వరకు యున్న వచనములలో యేసు కాలమునాడు జీవించియున్న వారికి సంభవింపబోవు సంఘటనలను వర్ణించుచున్నది. రెండవ భాగం 36 నుంచి 51 వరకు యున్న వచనములను ఆయన రెండవ రాకడకు సంబంధించిన సంఘటనలను వర్ణించుచున్నవి.

"అయితే ఆ దినమును" గూర్చి అని యేసు బోధింప నారంభించుసరికి

ఆయన ఒక క్రొత్త అంశమును గూర్చి బోధించుట కారంభించను చున్నాడని శిష్యులు ఎరుగుదురు. ఆదినము, ఆఘడియ ప్రభువు దినము అను పదములు లేఖనములలో సాధారణంగా ఆఖరి తీర్పును గూర్చి వివరించుటకుపయోగింపబడిన మాటలు. "అనేకులు ఆ దినమందు నన్ను చూచి........ " (మత్తయి 7:22). "విమర్శ దినమందు మీగతి కంటె తూరు సీదోను పట్టణముల వారిగతి ఓర్వ తగినదై యుండును" (మత్తయి 11:22). "దీనికి ఆశ్చర్యపడకుడి. ఒక కాలము (గడియ) వచ్చుచున్నది. ఆ కాలమున (గడియలో) సమాధులలో నున్న వారందరు ఆయన శబ్దము విని, మేలు చేసిన వారు జీవపునరుత్థానమునకును కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు" (యోహాను 5:28-29). "రాత్రివేళ దొంగ ఏలాగు వచ్చునో ఆలాగే ప్రభువు దినము వచ్చును " (1థెస్స 5:2).

మత్తయి 24వ అధ్యాయములో యున్న రెండు భాగములను వేరు చేయుచున్నది 36వ వచనము. మొదటి భాగంలో ఆయన యూదా జనాంగమునకు విధించు తీర్పును గూర్చి, సంఘటనలను గూర్చి, సమయాన్ని గూర్చి ఖచ్చితముగా చెప్పారు. యూదా జనాంగముపై ఆయన రాకడకు (తీర్పుకు) ముందు సంభవించు కొన్ని సంగతులను ఆయన ఖచ్చితంగా వివరించారు - అబద్ధక్రీస్తులు, యుద్ధములు, భూకంపములు , కరువులు, హింసలు మొదలైనవి సంభవించును. "మరియు ఈ రాజ్యసువార్త సకల జనములకు సాక్ష్యార్థమై లోకమందతటను ప్రకటించబడును" (24:14). "కాబట్టి ప్రవక్తయైన దానియేలు ద్వారా చెప్పబడిన నాశనకరమైన హేయవస్తువు పరిశుద్ధ స్థలమందు నిలుచుట చూడగానే" అంతము వచ్చేసిందని వారు గ్రహించాలి అని ఆయన చెప్పారు (24:15).

అయితే రెండవ భాగములో యేసు దేనిని గూర్చి ఖచ్చితముగా చెప్పలేదు."అయితే ఆ దినమును గూర్చియు, గడియను గూర్చియు, తండ్రికి తప్ప మరెవరికిని తెలియదని ఆయన బోధించారు (36 వచ)." కావున ఏదినమున మీప్రభువువచ్చునో మీకు తెలియదు గనుక మెలకువగా నుండుడి" (42వ). "మీరనుకొనని గడియలో మనుష్య కుమారుడు వచ్చును గనుకనే మీరును సిద్ధముగా ఉండుడి" (44వ). "ఆ దాసుడు కనిపెట్టని దినములోను వాడనుకొనని గడియలోను వాని యజమానుడు వచ్చును" (50వ). "ఆ దినమైనను ఆ గడియయైనను మీకు తెలియదు గనుక మెలకువగా ఉండుడి" (25:13). మత్తయి 24వ అధ్యాయములోని రెండవ భాగము జాగుచేయుట, ఆలస్యమగుటను గూర్చి వక్కాణించుచున్నది.

దుష్టుడైన దాసుడు "నా యజమానుడు ఆలస్యము చేయుచున్నాడని తన మనస్సులో" అనుకొనగల్గెను(24:48). పదిమంది కన్యకల ఉపమానములో "పెండ్లి కుమారుడు ఆలస్యము చేయగా ....." (25:5), తలాంతుల ఉపమానములో "బహుకాలమైన తరువాత ఆ దాసుల యాజమానుడు వచ్చి..." (25:19) అని యున్నది.

## మత్తయి 24:1-3 శిష్యులు కొన్ని ప్రశ్నలడుగుట

**1,2 వచనములు :** మత్తయి 21:23 నుండి 24:1 వరకు యేసు బోధించిన సత్యములన్నియు ఆయన దేవాలయములో యుండగా ఆయన శిష్యులు దేవాలయపు కట్టడములను ఆయనకు చూపించవచ్చిరి". శిష్యులు దేవాలయమును గూర్చి మురిసిపోవుచుండిరి (మార్కు 13:1; లూకా 21:5). "అందుకాయన మీరు ఇవన్నియు చూచుచున్నారుగదా. రాతిమీద రాయి యొకటియైనను ఇక్కడ నిలిచి యుండకుండ పడద్రోయబడునని" వారితో అనెను. ఆయన చెప్పిన రీతిగనే దేవాలయము పూర్తిగ నాశనము చేయబడెను!

**3వ వచనము :** యేసు ఒలీవ కొండమీద కూర్చుండి యున్నప్పుడు శిష్యులాయన యొద్దకు ఏకాంతముగ వచ్చి ఈ సంగతులను గూర్చి అడిగిరి. వారి మాటలను మత్తయి ఇట్లు వ్రాసాడు : "ఇవి ఎప్పుడు జరుగును? నీరాకడకును యుగ సమాప్తికిని సూచనలేవి ?" (24:3).

మార్కు ఇట్లు వ్రాసాడు : "ఇవి ఎప్పుడు జరుగును ? ఇవన్నియు నెరవేరబోవు కాలమునకు ఏ గురుతు కలుగును ? అది మాతో చెప్పుమని ఆయనను ఏకాంత మందు అడిగిరి " (మార్కు 13:4).

లూకా ఇట్లు వ్రాసాడు : "అప్పుడు వారు -బోధకుడా, ఆలాగైతే ఇవియెప్పుడు జరుగును? ఇవి జరుగబోవునని సూచన ఏమని ఆయన నడిగిరి" (లూకా21:7).

శిష్యులు ఎన్ని ప్రశ్నలడిగారు ? ఒకటా ? రెండా లేక మూడా ? వారు ఒకే సంఘటనను గూర్చి అడిగారా? లేక రెండు సంఘటనలను గూర్చా ? శిష్యులు రెండు ప్రశ్నలడిగారు. మొదటిగా "ఇవి (అనగా యెరూషలేము, దేవాలయము నాశనము) ఎప్పుడు జరుగునో" వారు తెలిసికొనగోరారు. మరియు అది జరుగు కాలమునకు ఏ గురుతు కలుగునో వారు తెలిసికొనగోరారు. రెండవదిగా, వారు యుగాంతమును గూర్చి తెలిసికొనగోరారు. వారు ప్రశ్నలడిగిన క్రమములోనే యేసు వారికి జవాబిచ్చారు. ఆయన మొదట యోరూషలేము నాశనము గావించబడుటను గూర్చి, దేవాలయము పడగొట్టబడుటను గూర్చి వారికి గురుతులు నిచ్చారు (మత్తయి

24:4-35). తరువాత యుగసమాప్తిని గూర్చి వారికి హెచ్చరికలనిచ్చారు (మత్తయి 24:36-25:46).

యెరూషలేము నాశనమును గూర్చిన సందర్భములో శిష్యులు యేసును "ఇవి ఎప్పుడు జరుగును ? ఇవన్నియు నెరవేరబోవు కాలమునకు ఏగురుతు కలుగును?" అని అడిగినట్లు మార్కు వ్రాసాడు (మార్కు 13:4). వారడిగిన ప్రశ్నకు యేసు యొక్క జవాబును మార్కు లిఖించాడు (మార్కు 13:4-30). వారికి కొన్ని వివరములిచ్చిన తరువాత యెరూషలేము, దానిలోని దేవాలయము ఎప్పుడు నాశనము గావించబడునో, దాని గురుతేమిటో యేసువారికి తెలియజేసారు: "ఆ ప్రకారమే మీరు ఈ సంగతులు జరుగుట చూచునప్పుడు ఆయన సమీపముననే ద్వారము దగ్గరనే ఉన్నాడని తెలిసికొనుడి" యని చెప్పెను (మార్కు 13:29). అంతేకాకుండా ఈ సంగతులన్నియు ఎంత వ్యవధిలో జరుగబోవుచున్నవో చెప్పుచు ఆయన ఒక అడుగు ముందుకు వేసారు: "ఇవన్నియు జరుగువరకు ఈ తరము గతింపదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను" (మార్కు 13:30). మత్తయి 24:33-34 మరియు మార్కు 13:29-30 లు సమానాంతర వచనములు గనుకను మార్కు 13:29-30కి ముందు చెప్పిన సంగతులన్నియు యెరూషలేము నాశనము గావించబడుటను గూర్చి చెప్పబడినవి గనుకను, మత్తయి 24:33-34 కు ముందు చెప్పబడిన సంగతులు అన్నీ కూడా యెరూషలేము నాశనమును గూర్చియే చెప్పబడెనని మనము గ్రహింపనగును గదా!

## మత్తయి 24:4-14 మోసపరచు సూచనలను గూర్చి హెచ్చరికలు

**4,5 వచనములు** : "యేసు వారితో ఇట్లనెను -ఎవడును మిమ్మును మోసపరచకుండ చూచుకొనుడి. అనేకులు నా పేరట వచ్చి నేనే క్రీస్తునని చెప్పి పలువురిని మోసపరచెదరు " (మత్తయి 24:4-5). అబద్ధ బోధకులు విస్తరించెదరని యేసు వారిని హెచ్చరించెను. జోసిఫస్ అను చరిత్రకారుడు యెరూషలేము నాశనము చేయబడే సరికి అనేకమైన క్రీస్తులుండిరని వ్రాసాడు. అట్టి వారిని గూర్చి గమలీయేలను ధర్మశాస్త్రోపదేశకుడు కూడా చెప్పాడు (అపొ.కా. 5:35-37).

**6వ వచనము:** "మరియు మీరు యుద్ధములను గూర్చియు, యుద్ధ సమాచారములను గూర్చియు వినబోదురు". యేసు ఈ మాటలు చెప్పుసరికి రోమా

సామ్రాజ్యములో శాంతి నెలకొల్పబడి యుండెను. గాని అతి త్వరలోనే నలుమూలల అది యుద్ధములతో ఆవరింపబడెను. "ఇవి జరుగవలసి యున్నవి గాని అంతము వెంటనే రాదు" (6వ) అనుమాట అంత్య తీర్పును గాక యెరూషలేము యొక్క అంతమును గూర్చి చెప్పబడినది.

7వ వచనము : అక్కడక్కడ కరవులు, భూకంపములు కలుగును. క్లౌదియ చక్రవర్తి కాలములో అతి భయంకరమైన కరవు సంభవించెను. యెరూషలేము నుండి అంతియొకయకు వచ్చిన ప్రవక్తలలో "అగబు అను ఒకడు నిలువబడి భూలోకమంతట కరువు రాబోవుచున్నదని ఆత్మద్వారా సూచించెను. అది క్లౌదియ చక్రవర్తి కాలమందు సంభవించెను" (అపొ.కా. 11:27-28). క్రీ॥శ॥ 79లో గొప్ప ప్రళయము సంభవింపగా పొంపైయి పట్టణము సర్వనాశనమాయెను. దానికంటె ముందు 63వ సంవత్సరం ఫిబ్రవరి 5వ తేదినాడు గొప్ప భూకంపము సంభవించెను.

8వ వచనము : "ఇవన్నియు వేదనలకు ప్రారంభము".

9వ. వచనము : తరువాత క్రైస్తవులకు కలుగు గొప్ప హింసలను గూర్చి యేసు హెచ్చరికల నిచ్చారు. "అప్పుడు జనులు మిమ్మును శ్రమలు పాలు చేసి చంపెదరు. మీరు నా నామము నిమిత్తము సకల జనముల చేత ద్వేషింపబడుదురు". యేసు అపొస్తలులకు పరిమితి గల ఆజ్ఞలనిచ్చి పంపినప్పుడు వారు ఎదుర్కొనే హింసలను గూర్చి ముందుగనే చెప్పి పంపించారు: "సహోదరుడు సహోదరుని, తండ్రి కుమారుని మరణమునకు అప్పగించెదరు. పిల్లలు తండ్రులమీద లేచి వారిని చంపించెదరు. మీరు నా నామము నిమిత్తము అందరిచేత ద్వేషింపబడుదురు. అంతము వరకు సహించిన వాడు రక్షింపబడును. వారు ఈ పట్టణములో మిమ్మును హింసించునప్పుడు ....." (మత్తయి 10:21- 23).

ఈ ప్రవచనము యొక్క నెరవేర్పును అపొస్తలుల కార్యముల గ్రంథములో మనము విపులముగా చూడవచ్చును. (అపొ.కా. 4-5 అధ్యా). స్తెఫనును రాళ్లతో కొట్టి చంపిరి (అపొ.కా. 6-7అధ్యా). క్రీస్తు సంఘమునకు గొప్ప హింస కలిగెను(అపొ.కా. 8-9అధ్యా) మరియు యాకోబు ఖడ్గము వలన శిరచ్ఛేదనము చేయబడెను (అపొ.కా. 12:1-2).

10వ వచనము : "అనేకులు అభ్యంతరపడి యొకనినొకడు అప్పగించి యొకని

నొకడు ద్వేషింతురు ". అపొ.పౌలు ఇట్లు వ్రాసాడు : "ఆసియాలోని వారందరు నన్ను విడిచి పోయిరను సంగతి నీవెరుగుదువు. వారిలో పుగెల్లు, హెర్మొగెనే అను వారున్నారు" (2తిమోతి 1:15). " దేమా యిహలోకమును స్నేహించి నన్ను విడిచి థెస్సలోనీకకు వెళ్ళెను "....... "నేను మొదట సమాధానము చెప్పినప్పుడు ఎవడును నా పక్షముగా నిలువలేదు, అందరు నన్ను విడచిపోయిరి; ఇదివారికి నేరముగా ఎంచబడకుండును గాక " (2తిమో 4:10,16,). రోమా దేశపు చరిత్రకారుడైన టేసిటస్ అనునతడు మొదట అనేక వేల క్రైస్తవులు పట్టుబడిరని వారి మూలమున అసంఖ్యాకులు పట్టుబడి హేళన చేయబడి క్రూరముగ హింసింపబడిరి యని వ్రాసాడు.

**11,12 వచనములు** : "అనేకులైన అబద్ధ ప్రవక్తలు వచ్చి పలువురిని మోసపరచెదరు. " అపొస్తలుల కార్యములు గ్రంధములోను ప్రతికలలోను బయలు పర్చబడిన రీతిని బట్టి అనేకులైన అబద్ధ ప్రవక్తలుద్భవించిరి (అపొ.కా. 20:29; రోమా 16:17, 18; 2 పేతురు 2:1; 1 యోహాను 4:1). యెరూషలేము నాశనము దగ్గరయ్యే కొలది దుష్టత్వము ఘోరముగా పెచ్చు పెరిగెను. హింసలు, శోధనల వలన పరిశుద్ధులనేకులు జయింపబడిరి. క్రీస్తు యెడల ఒకానొకప్పుడు వారికున్న ప్రేమ చల్లారెను (12వ).

**13వ వచనము** : యెరూషలేము నాశనమునకు ముందు కలుగు హింసలు శోధనలు మొదలైన వాటిని సంహించిన వాడు రక్షింపబడును. అయితే ఏ విధముగా రక్షింపబడును?

అంతము వరకు సహించిన వాడెవడో వాడే రక్షింపబడునను మాటలో ఆత్మ యొక్క నిత్యరక్షణ యున్నదని కొందరు తలుస్తారు. సహనము, నమ్మకము నిత్య రక్షణకు దోహదము చేస్తాయనుటలో సందేహములేదు. అయితే యేసు ఇక్కడ హింసలనుండి తప్పించుకొని ప్రాణమును కాపాడుకొనుటను గూర్చి హెచ్చరిక చేయుచుండెను. గనుక ఈ మాటలు ముందుగా తమ ప్రాణ రక్షణకు వర్తించును. యేసు చేసిన ముందు హెచ్చరికలను బట్టి యెరూషలేము దండ్లచేత చుట్టబడి నాశనముగావించ బడినప్పుడు క్రైస్తవులలో ఎవరును నాశనము కాలేదనుట గమనించ దగిన విషయం.

**14వ వచనము** : "మరియు ఈ రాజ్యసువార్త సకల జనములకు సాక్ష్యార్థమై లోకమందంతటను ప్రకటింపబడును; అటు తరువాత అంతము వచ్చును". యెరూషలేము యొక్క అంతమునకు ముందు ఏమి సంభవించునో తెలియజెప్పు

ఆఖరి సూచన యిది. అది అక్షరాల నెరవేరెనని క్రొత్త నిబంధన బోధించుచున్నది. పౌలు కొలస్సయులకు వ్రాయుచు "ఆకాశము క్రిందనున్న సమస్త సృష్టికి ప్రకటింపబడినట్టియు ఈ సువార్త వలన కలుగు నిరీక్షణ నుండి తొలగిపోవద్దని" వారిని హెచ్చరించెను (కొలస్స 1:23). రోమాలోయున్న క్రైస్తవుల "విశ్వాసము సర్వలోకమునకు ప్రచురము చేయబడు చుండెను" (రోమా 1:8; 10:18; 16:26).

**24:15-28 యెరూషలేము నాశనమునకు ముందు కనబడు యధార్ధ సూచన**

**15వ వచనము :** "కాబట్టి ప్రవక్తయైన దానియేలు ద్వారా చెప్పబడిన నాశనకరమైన హేయ వస్తువు పరిశుద్ధ స్థలమందు నిలుచుట మీరు చూడగానే......" సకల జనములకు సువార్త ప్రకటింపబడకముందు యెరూషలేము నాశనము గావించబడదని యేసు చెప్పిన తరువాత ఒక నిజమైన సూచనను వారికి తేలియజేసెను. యెరూషలేము నాశనము యొక్క సమయం, సూచన ఆయన వారికి తెలియజేసెను.

నాశనకరమైన హేయ వస్తువు పరిశుద్ధ స్థలములో నిలుచును! యిది అసలైన సూచన !! ఈ హేయ వస్తువును గూర్చి దానియేలు ప్రవచించెను. ఆ పదమును మూడుసార్లు వినియోగించెను (దానియేలు 9:27; 11:31; 12:11). దానియేలు గ్రంథములో విగ్రహారాధనకు హేయము అనే పదము గొప్ప సంబంధమున్నది. హేయము, హేయవస్తువు అనునవి విగ్రహారాధనను గూర్చి యితర లేఖన భాగములలో కూడ వాడబడినవి (1 రాజులు 11:5-7; 2 రాజులు 23:13; యెహెజ్కేలు 5:11).

మత్తయి24:15లో చెప్పబడిన "నాశనకరమైన హేయవస్తువే "రోమా దేశపు సైన్యములు. వారు మొదట యెరూషలేమును చుట్టుముట్టి దేవాలయమును అతి పరిశుద్ధ స్థలమును అపవిత్ర పరచెదరు. దీనిని గూర్చియే లూకా "యెరూషలేము దండ్లచేత చుట్టబడుట మీరు చూచునప్పుడు దాని నాశనము సమీపమై యున్నదని తెలిసికొనుడి" యని యేసు చెప్పిన మాటలను వ్రాసెను (లూకా 21:20).

**16-18 వచనములు :** యూదయలో ఉండువారు ఈ సూచన కనబడగానే కొండలకు పారిపోవలెను (16వ). అది అకస్మాత్తుగా కనబడును. మిద్దెమీద ఉండువాడు తన యింటిలో నుండి ఏదైనా తీసికొనిపోవుటకు దిగకూడదు. పొలములో ఉండువాడు తన బట్టలు తీసికొని పోవుటకు ఇంటికి రాకూడదు (17-18వ).

**19,20 వచనములు :** వారు త్వరగా పారిపోవుటకు కొన్ని ఆటంకములు కలుగవచ్చును. కొందరు స్త్రీలు గర్భవతులై యుండవచ్చును. మరికొందరు పాలిచ్చు తల్లులై యుండవచ్చును (19వ). వారు పారిపోవుట కష్టమగును గనుక అది చలికాలమున సంభవించకూడదని ప్రార్థించాలి. విశ్రాంతి దినమున పురద్వారములు మూసివేయబడును గనుక అది విశ్రాంతి దినమున సంభవించ కూడదని ప్రార్థించాలి (20వ).

**21, 22 వచనములు :** "లోకారంభమునుండి ఇప్పటివరకును అట్టి శ్రమ కలుగలేదు, ఇక ఎన్నడును కలుగబోదు" అని యేసు హెచ్చరించెను (21వ). యెరూషలేము దండెత్తబడినప్పుడు 97,000 మంది యూదులు పట్టుబడిరనియు, 11 లక్షలమంది ఆ ముట్టడిలో ప్రాణములు కోల్పోయిరనియు జోసిఫస్ అను చరిత్రకారుడు వ్రాసెను. ఆకలి బాధకు ఒక స్త్రీ తన సొంత బిడ్డనే చంపి తినిన ఉదంతమును కూడ జోసిఫస్ వ్రాసెను. "ఇక ఎప్పుడును కలుగబోదు" అను మాటలను బట్టి దాని తరువాత కాలము ఇంకా ఉండునని అర్ధమగుచున్నది. ఆనాటి హింస ఎంత గొప్పదంటే, "ఆ దినములు తక్కువ చేయబడకపోయిన యెడల ఏ శరీరయు తప్పించుకొనడు " (22వ ). ఆ పట్టణమును ముట్టడించిన రోమా సైన్యాధిపతులలో ఒకడగు సెస్టియస్ గేలియస్ తన సైన్యములతో ఆ పట్టణమునకు వెళ్లి, తన్ను ఎవడును ఎదురాడ నందున అకస్మాత్తుగా అతని సైన్యములను వెనుకకు మళ్లించెనను సంగతి ఒక వింతయైన వాస్తవమే.

**23-28 వచనములు :** ఆ ముట్టడి సమయంలో బయలుదేరు అబద్ధపు క్రీస్తులను గూర్చి, అబద్ధ ప్రవక్తలను గూర్చి యేసు మళ్లీ హెచ్చరిక చేసారు (23-26వ). వీరు ఏర్పరచబడిన వారిని సైతము మోసపుచ్చుదురు. ఆయన రాక అకస్మాత్తుగా యుండునని చెప్పుటకు ఆయన మెరుపును ఒక ఉదాహరణగా వినియోగించారు. ఇశ్రాయేలీయులకు తీర్పు తీర్చుటకు ఆయన రాక ఖచ్చితమని చెప్పుటకు, "పీనుగు ఎక్కడ ఉన్నదో అక్కడ గద్దలు పోగవునని" చెప్పారు (28వ).

యూదా జనాంగము ఒక పీనుగుగా ఇక్కడ పోల్చబడెను. అది నైతికంగా, ధార్మికంగా, ఆత్మీయకంగా మృతి జెందెను. మత్తయి 23వ అధ్యాయంలో యేసు వారిని గద్దించిన విధానం వారి ఆత్మీయ, నైతిక మృతిని బయలు పరచుచున్నది. వారిని గద్దిస్తూ చివరకు ఆయన, "ఇదిగో మీ యిల్లు మీకు విడువబడి యున్నది" యని హెచ్చరించెను (23:37). ఒక పీనుగు దగ్గరకు గద్దలు ఏలాగు పోగవునో,

ఆలాగే యూదుల పట్టణమైన యెరూషలేము దానిని భక్షించువారిని ఆకర్షించును.

యూదా జనాంగమును శిక్షించుటకు దండెత్తు అన్య జనాంగములను గద్దలుగా పాత నిబంధన తరుచు చిత్రీకరించుచున్నది. (ద్వితీయో 28:49; హోషే 8 :1; హబక్కూ 1:8).

## మత్తయి 24:29-35 ప్రవచనాత్మక అలంకార భాష యెరూషలేము నాశనమును మరింత వర్ణించుచున్నది

**29-31 వచనములు :** "ఆ దినముల శ్రమ ముగిసిన వెంటనే చీకటి సూర్యుని కమ్మును, చంద్రుడు కాంతినియ్యడు, ఆకాశమునుండి నక్షత్రములు రాలును, ఆకాశమందలి శక్తులు కదలింపబడును" (29వ). యిది ఈలోకాంతమును క్రీస్తుయొక్క రెండవ రాకడను సూచించుచున్నదని కొందరు తలుస్తారు. అయితే బైబిలులో యున్న ప్రవచనాత్మక సంఘటనలను, హెచ్చరికలను బట్టి చూస్తే యిది నిజానికి యూదా మతము గతించిపోవుటను వర్ణించుచున్నదని గమనించుకొన వచ్చును.

బైబిలులో యిట్టి వర్ణన దుష్టజనాంగము అంతమును సూచించుటకు ఉపయోగింపబడెను. బబులోను యొక్క పతనమును వర్ణించుచు, "ఆకాశ నక్షత్రములును, నక్షత్రరాసులును తమ వెలుగు ప్రకాశింప నియ్యవు. ఉదయకాలమున సూర్యుని చీకటి కమ్మును చంద్రుడు ప్రకాశింపడు" అని చెప్పబడినది (యెషయా 13:10). ఏదోము దేశపతనము ఇట్లు వర్ణించబడినది: "ఆకాశ సైన్యమంతయు క్షీణించును. కాగితపు చుట్టవలె ఆకాశవైశాల్యములు చుట్టబడును....." (యెషయా 34:4,5). ఐగుప్తు దేశాధిపతుల పతనమును వర్ణించుచు దేవుడు; నేను నిన్ను ఆర్పివేసి ఆకాశ మండలమున మరుగుజేసెదను, నక్షత్రములకు చీకటి కమ్మివేసెదను, సూర్యుని మబ్బుచేత కప్పెదను, చంద్రుడు వెన్నెల కాయకపోవును. నిన్ను బట్టి ఆకాశమందు ప్రకాశించు జ్యోతుల కన్నిటికి అంధకారము కమ్మ జేసెదను, నీ దేశముమీద గాఢాంధకారము వ్యాపింపజేసెదను" అని చెప్పెను (యెహెజ్కేలు 32:7-8).

ఆయా జనాంగముల నాశనమును వర్ణించుటకు యిట్టి భాష వాడబడినందున యేసు కూడ అట్టి భాషనే వాడుట ఆశ్చర్యము కాదు. చీకటి సూర్యుని కమ్మడం,చంద్రుడు కాంతిహీనుడవడం, నక్షత్రములు రాలిపోవడం వగయిరా అంతా యూదుల ప్రధానులు పతనమవడం, చిరకాలమునుండి యుండిన అధికారులు, శక్తులు అణగద్రొక్కబడడం మొదలైన వాటిని సూచిస్తూ, యూదా ప్రజలపై కమ్ముకొనిన అంధకారమును వర్ణించుచున్నది.

**30 వ వచనము:** "అప్పుడు మనుష్య కుమారుని సూచన ఆకాశమందు కనబడును". అప్పుడు మనుష్యకుమారుడు ఆకాశమందు కనబడునని ప్రభువు చెప్పలేదు గాని మనుష్యకుమారుని సూచన కనబడునని చెప్పెను. ఆయన విధించు తీర్పే ఒక సూచన . ఆ సూచన భూమిమీద, యెరూషలేములో యుండును. యెరూషలేము నాశనము గావించబడుట ప్రభువు యొక్క సూచన మాత్రమే గాకుండా ఆయన పరలోకములో నుండి పాలించుచున్నాడనుటకు ఒక గొప్ప మూలాధారమై యుండును.

మనుష్య కుమారుడు తనను గూర్చి తానే యొక సూచన నిచ్చుచున్నాడు. ఆయనను వారు అప్పటివరకు అంగీకరించలేదు. ఆయనను గూర్చిన సూచన కంటికి కనబడే లాగున గాక ప్రతిదండన చేయుచు తీర్పువిధించుచు ఆయన వారికి ఎంత బాహాటముగా కనబడునంటే వారందరు వారికిష్టమున్నను లేకపోయినను శిక్షవిధించుచున్నవాడు ఆయనే యని ఒప్పుకొనక తప్పదు (యెష 25:2).

"అప్పుడు మనుష్య కుమారుడు ప్రభావముతోను మహా మహిమతోను ఆకాశ మేఘారూఢుడై వచ్చుట చూచి భూమిమీదనున్న సకల గోత్రముల వారు రొమ్ము కొట్టుకొందురు" (30వ). ప్రపంచమంతటా చెదరిపోయిన యూదులు యెరూషలేము నాశనమును గూర్చి వినినప్పుడువారిలో గొప్ప రోదన కలుగును. ఈ వచనములో ప్రభువు మేఘారూఢుడై వచ్చుట ఆయన రెండవ రాకడను సూచించుట లేదు. ఐగుప్తునకు తీర్పు తీర్చుటకు ప్రభువు దిగి వచ్చుటను గూర్చి యెషయా వ్రాసాడు. గాని అతడుపయోగించిన పద జాలమును గమనించుము: "యెహోవా వేగముగల మేఘము ఎక్కి ఐగుప్తునకు వచ్చుచున్నాడు. ఐగుప్తు విగ్రహములు ఆయన సన్నిధిని కలవరపడును. ఐగుప్తీయుల గుండె కరగుచున్నది" (యెషయా 19:1). యూదులకు ప్రతిదండన జరుగుచున్నప్పుడు వారు మనుష్య కుమారుని ప్రభావమును, మహిమను తప్పక గుర్తింతురని యేసు ఇక్కడ చెప్పెను.

**31వ వచనము :** "మరియు ఆయన గొప్ప బూరతో తన దూతలను పంపును. వారు ఆకాశము యొక్క ఈ చివరనుండి ఆ చివర వరకు నలుదిక్కుల నుండి ఆయనఏర్పరచుకొనిన వారిని పోగు చేతురు". ఈ సందర్భములో దూతలు అనగా వార్తావాహులు అని యర్థము (మత్తయి 11:10; మార్కు 1:2; లూకా 7:24-27; 9:52; యాకోబు 2:25లను చూడుము). ఆకాశము యొక్క నలుదిశలనుండి ఏర్పరచబడిన వారు పోగు చేయబడుట, అన్యజనాంగములు క్రీస్తులోనికి

మార్పుజెందుటను సూచించుచున్నది. ఆ తరము వారు గతించకమునుపే క్రీస్తు సువార్త నాటి లోకమునకంతటికిని ప్రకటింపబడును.

**32-35 వచనములు :** " అంజూరపు చెట్టును గూర్చి ఒక ఉపమానము నేర్చుకొనుడి...." (32వ). అంజూరపు చెట్టు చిగిరించినప్పుడు వసంతకాలముసమీపముగా నున్నదని ఎట్లు తెలియునో అట్లే, ఆ ప్రకారమే యెరూషలేము నాశనమునకుముందు మీరీ సంగతులన్నియు జరుగుట చూచునప్పుడు దాని నాశనము సమీపముననే, ద్వారము దగ్గరనే యున్నదని తెలిసికొనవలెను (33వ). ఇవన్నియు జరుగువరకు ఆయన మాటలను వినుచున్నవారి తరము గతింపదు.నిజానికి వారి జీవిత కాలములోనే ఇవన్నీ జరుగును (34వ).

"ఇవన్నియు" అను మాటలకు ప్రభువు వాడిన విధానమును గమనించుము: **1.** ఇవన్నియు ఈ తరము వారి మీదికి వచ్చును" (23:36). **2.** "మీరు ఇవన్నియు చూచుచున్నారు గదా...." (24:2). **3.** "ఇవి (ఇవన్నియు) ఎప్పుడు జరుగును?"(24:3). **4.** "ఇవి (ఇవన్నియు) జరుగవలసియున్నవి" (24:6). **5.** "ఇవన్నియు వేదనలకు ప్రారంభము" (24:8). **6.** మీరీ సంగతులన్నియు జరుగుట చూచునప్పుడు ఆయన సమీపముననే, ద్వారము దగ్గరనే యున్నాడని తెలిసికొనుడి" (24:33). **7.** "ఇవన్నియు జరుగువరకు ఈ తరము గతింపదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను" (24:34). ఈ విధముగా ఆ తరము వారు మరణించక ముందే మత్తయి 24లో చెప్పబడిన ప్రతి సూచన నెరవేరెను. ఆయన చెప్పిన దానిని గట్టిగా వక్కాణించుటకుగాను "ఆకాశమును భూమియు గతించును గాని నా మాటలు ఏ మాత్రమును గతింపవు" అని ప్రభువు పలికెను (35వ).

## మత్తయి 24:36-44 ఈ లోకాంతమును గూర్చి

**36వ వచనము :** ఒక సందర్భములో నుండి మరొక సందర్భములోనికి నడిపించే (Transition) వచనము 36వ వచనము. ఆ మాటలలోని మార్పే ఆయన వేరొక అంశమును గూర్చి చెప్పుచున్నాడని తెలియజేయుచున్నది. మత్తయి 24:4-35వరకు యున్న మొదటి భాగములో 'దినములు' అని బహువచనం వాడబడింది (19,22,29 వచ). అయితే రెండవ భాగంలో (24:36-51), దినము, గడియ యని ఏకవచనము వాడ బడింది (36,42,44,50వచ ; 25:13).

ఆ దినమును గూర్చి, గడియను గూర్చి మత్తయి సువార్తలో ప్రభువుమాటలను వ్రాస్తూనే వచ్చాడు గనుక ప్రభువు యొక్క మనస్సు యేమివున్నదో అపొస్తలులకు ఇట్టే తెలియును. "ఆ దినమందు అనేకులు నన్ను చూచి.... " యని ప్రభువు చెప్పారు (7:22). మరల "విమర్శ దినమందు మీగతి కంటె తూరు సీదోను పట్టణముల వారిగతి ఓర్వతగినదై యుండునని" ఆయన చెప్పెను (11:22)."విమర్శ దినమందు నీ గతికంటె సొదొమ దేశపు వారి గతి ఓర్వతగినదై యుండునని " ప్రభువు చెప్పెను (11:24). "మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటను గూర్చియు విమర్శ దినము లెక్క చెప్పవలసియుండునని" ఆయన చెప్పెను (12:36). క్రీస్తు తీర్పు తీర్చుటకు వచ్చురెండవ రాకడను గూర్చి 'ఆ దినములు' 'ఆ గడియలు' అను బహు వచనము లేఖనములలో ఎక్కడను వినియోగింపబడలేదు. "అంత్యదినములు" అనుపదము క్రీస్తు యొక్క రెండవ రాకడకు ముందు ఒక స్వల్ప కాలమును సూచించుట లేదు (హెబ్రీ 1:1,2; అపొ.కా. 2:16,17; 2తిమోతి 3:1).

ఆ దినమును గూర్చియు, ఆగడియను గూర్చియు తండ్రి మాత్రమే యెరుగును గాని, యే మనుష్యుడైనను పరలోకమందలి దూతలైనను ఎరుగరు గనుక, ప్రభువు ఎప్పుడు వచ్చునో యని ప్రవచించువారు, జోస్యము చెప్పువారు కేవలము వివేక శూన్యులని గమనించాలి (24:36).

**37-41 వచనములు :** నోవహు దినములలో యేలాగుండెనో క్రీస్తు యొక్క రెండవ రాకడయు ఆలాగుండును (37వ). జలప్రళయమునకు ముందటి దినములలో ప్రజల దైనందిన జీవితం మామూలుగానే యుండెను. వారు తినుచు, త్రాగుచు, పెండ్లిండ్లు చేసుకొంటూ యుండిరి. జల ప్రళయము అకస్మాత్తుగా వారి మీదికి వచ్చెను. "జలప్రళయము వచ్చి అందరిని కొట్టుకొని పోవువరకు ఎరుగక పోయిరి. ఆలాగుననే మనుష్యకుమారుని రాకడ ఉండును" (39వ).

జల ప్రళయమునకు ముందు ప్రజలు నోవహు యొక్క బోధను ఎట్లు లక్ష్యపెట్టటలేదో, అట్లే , తీర్పు గూర్చి ప్రభువు యొక్క హెచ్చరికలను అనేకులు లక్ష్యపెట్టలేదు (2పేతురు 2:5). తీర్పును గూర్చి హేళన చేయువారు కూడ కొందరున్నారు (2 పేతురు 3:3-10). మత్తయి 24:40-41 వచనములు కూడ క్రీస్తు రెండవ రాకడకు ముందున్న కాలము మామూలుగానే యుండుననియు, ఆ రాకడలో గొప్ప ఎడబాటు సంభవించుననియు ఈ వచనములు బోధించుచున్నవి.

**42-44 వచనములు :** ప్రభువు ఎప్పుడు వచ్చునో ఎవనికిని తెలియదు గనుకను, యెరూషలేము నాశనమునకు ముందున్నట్టి గుర్తులులాంటివి క్రీస్తు రెండవ రాకడకు యేమీ లేనందువలనను ప్రతివాడు మెలకువగా యుండి సిద్ధపడి యుండుట అత్యవుసరము. 42 వచనములో యేసు మెలకువగా యుండుడి అని చెప్పారు. 44 వ వచనములో సిద్ధముగా ఉండుడి యని చెప్పారు. దొంగ ఎప్పుడువచ్చునో అద్వాన్నుగా ఎట్లు చెప్పడో అట్లే క్రీస్తు కూడా తన రెండవ రాకడ సమయమును ముందుగా మనకు తెలియపరచరు (1థెస్స 5:2-6; 2 పేతురు 3:10).

## 24: 45-51 నమ్మకమైన బుద్ధిగల దాసుని ఉపమానము

**45-49 వచనములు :** "యజమానుడు తన యింటి వారికి తగిన వేళ అన్నము పెట్టుటకు వారిపైన ఉంచిన నమ్మకమైన వాడును బుద్ధిమంతుడునైన దాసుడెవడు?" (45వ). ఈ వచనమే ఒక ఉపమానము. ఏ క్షణములోనైనా తమ ప్రభువు తిరిగి వచ్చును గనుక శిష్యులు చురుకుగా యుండాలి. నమ్మకమైన క్రైస్తవుడు ప్రభువు తనకు విధించిన ఆజ్ఞలనే ఆయన రాకడవరకు నెరవేరుస్తూనే యుండును. గాని అపనమ్మకస్థుడు ఆయన ఇప్పుడప్పుడే రాడనుకొనుచు ఆయన చిత్తానికి భిన్నముగా ప్రవర్తించును (48-49వచ).

**50-51 వచనములు :** ప్రభువు అకస్మాత్తుగా ప్రత్యక్షమై అపనమ్మకమైన దాసుడు పాపములోయుండుట కనుగొనును (50వ). ఆయన "వానిని నరికించి వేషధారులతో కూడ వానికి పాలు నియమించును. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండును" (51వ). మెలకువలేని జీవితం. నాశనానికి మూలం. చాలా సమయమున్నదిలే యనే తలంపులు మోసకరమైనవి.

మనం పాపములేని వారముగా గాక (1యోహాను 1:7-10) నమ్మకమైన దాసులుగా యుండాలని దేవుని వాక్యం హెచ్చరించుచున్నది. నమ్మకమైన క్రైస్తవు డెవరు? నమ్మకమైన క్రైస్తవుడు

1. యధార్థవంతుడు (సామె 14:5).
2. నిందారహితుడు (దానియేలు 6:4).
3. ఎల్లవేళలా మెలకువగా యుండువాడు (మత్తయి 24:42-51).
4. తన తలాంతులనుపయోగించువాడు (మత్తయి 25:21).

# యెరూషలేము నాశనములో ప్రభుని రాకడ యొక్కయు ఆయన కడవరి రాకడ యొక్కయు సంగ్రహణ

| యెరూషలేమునాశనము | క్రీస్తుకడవరిరాకడ |
|---|---|
| 1. ఇందులోకొండలకు పారిపోవుటలో మేలు కలుగును. | 1. ఎక్కడికైనా పారిపోవుటలో కలిగే మేలు యేదీలేదు. |
| 2. యిది స్థానికం - ముఖ్యంగా యూదయ పాలస్తీనా ప్రాంతములలో సంభవించును. | 2. యిది సార్వజనికం. |
| 3. యిందులో త్వరిత గతిని పారి పోవాలి. | 3. పారిపోవుటకు త్వరపడుటలో కలిగేది యేమీలేదు. |
| 4. అవిశ్వాసులైన యూదులు సబ్బాతు ఇంకా నిలిచియున్నది అనుకొనే రోజులలో యిది సంభవించును. | 4. సబ్బాతు అంతమైన చాల కాలము నకు యిది సంభవించును. |
| 5. వేదన దినములు తక్కువ చేయబడుట ద్వారా ఏర్పరచబడిన వారికి సహాయము దొరుకును. | 5. యిందులో తక్కువ చేయబడే దినాలు యేమీ వుండవు. |
| 6. అబద్ధ బోధకులు ఇదిగో క్రీస్తు అక్కడ వున్నాడు, ఇక్కడ వున్నాడు అని బోధింతురు. | 6. ఇందులో క్రీస్తును అందరు చూస్తారు. |
| 7. దీనికి ముందు వేదనలు కలుగును | 7. వేదనలు సంభవిస్తాయనే సూచన ఎక్కడ లేదు. |
| 8. దీనికి ముందు ఖచ్చితమైన సూచనలున్నాయి. | 8. సూచనలు యేమీ వుండవు. |

| | |
|---|---|
| 9. యిది సంభవించు సమయం ప్రభువుకు తెలుసు. | 9. దీని సమయం ప్రభువుకు తెలియదు. |
| 10. యిది సంభవించిన తరువాత కూడా సువార్త ప్రకటింపబడును. | 10. దీనియనంతరం సువార్త ప్రకటన వుండదు. |
| 11. యిది నిర్ధిష్ట సమయములో సంభవించును. | 11. సమయం నిర్ధిష్టము కాలేదు. |
| 12. దీనికి ముందు యుద్ధములు, కరువులు, భూకంపములు మొదలైనవి సంభవించును. | 12. దీనికి ముందు అంతా మామూలు గానే యుండును. |
| 13. ఇందులో కొందరు తప్పించుకొనే అవకాశమున్నది. | 13. దీనిని ఎవడు తప్పించుకొనజాలడు. |
| 14. అంజూరపు చెట్టు యొక్క ఉపమానము ద్వారా వర్ణించబడినది. | 14. ముందు హెచ్చరిక లేకుండా వచ్చు దొంగవలె వచ్చునని వర్ణించబడినది. |
| 15. యిది ప్రభువు కాలము నాడు జీవించుచున్నవారి తరములో సంభవించును. | 15. ఆయన రాకడ ఆలస్యమగునని జాప్యమగునని చెప్పబడెను. |
| 16. యిది ఒకే జనాంగముపై విధించబడిన స్థానికి తీర్పు. | 16. యిది సార్వజనికం. అన్ని జనాంగములకు సంభవించు తీర్పు. |

## వెయ్యేండ్ల పాలన సిద్ధాంతము

ఇదొక అబద్ధ సిద్ధాంతము. క్రీస్తు మరల వచ్చి భూమి మీద వెయ్యేండ్లు పాలించునని ఈ సిద్ధాంత ఉద్బోధకులు బోధిస్తారు. వెయ్యేండ్ల పాలనను గూర్చి చెప్పువారు మత్తయి 24వ అధ్యాయాన్ని ఎక్కువ ఉపయోగించడానికి ప్రయత్నిస్తారు. అయితే మత్తయి 24 వ అధ్యాయం గాని, బైబిలులో ఏ భాగమైన గాని ఈ వెయ్యేండ్ల పాలనను సమర్ధించుటలేదు.

## ముగింపు

మత్తయి సువార్తలో 24, 25 అధ్యాయములు గొప్ప అధ్యాయములు. వాటి సందర్భానుసారముగా చదివిన యెడల గొప్ప సత్యములు అందులో బయలు పరచబడినవి. మత్తయి 24వ అధ్యాయంలో యున్న మొదటి 35 వచనములు అసాధారణమైన కాలమును గూర్చి చెప్పుచుండగా, రెండవభాగం (24:36–25:46) సాధారణ కాలమును గూర్చి చెప్పుచున్నది. యెరూషలేము నాశనమును గూర్చి ఖచ్చితమైన సూచనలియ్యబడగా, క్రీస్తు యొక్క రెండవ రాకడకు ఏవిధమైన సూచనలు ఇయ్యబడలేదు. యెరూషలేము నాశనమును గూర్చి ప్రభువు చెప్పిన సంగతులు ఖచ్చితంగా నెరవేరినవి గనుక ఆయన రెండవ రాకడ, తీర్పును గూర్చిన సంగతులు ఖచ్చితంగా నెరవేరును. నీవు సిద్ధముగా యున్నావా? మెలకువగా యున్నావా ? " ఏ దినమున మీ ప్రభువు వచ్చునో మీకు తెలియదు గనుక మెలకువగా యుండుడి" (మత్తయి 24:42).

- జేమ్స్ మెడోస్.

# సాక్షి

నూతన నిబంధనలోని ఇరువదియేడు గ్రంథాలలో పలు విధముల వర్ణింపబడినవాడు ప్రభువయిన యేసు. ఆయనే క్రీస్తు. ఇసాయిగా పిలువబడినా ఇమ్మానుయేలనబడినా భాషాపరంగా మరే విధముగా పేర్కొనబడినా ఆయన యీలోకానికి పంపబడిన దైవ వాగ్దాన పుత్రుడయిన మెస్సీయ.

మత్తయి సువార్తలో ఆయన యూదుల రాజుగా అభివర్ణించబడి మార్కు సువార్తలో దేవుని సేవకునిగా ప్రేమించబడుచు లూకా సువార్తలో పరిపూర్ణ మనుష్య కుమారునిగా లెక్కించబడి యోహాను సువార్తలో దేవుని కుమారునిగ గుర్తించబడినాడు. అట్లే అపొస్తలుల కార్యములులో ఆరోహణుడయిన ప్రభువుగా గమనించబడి రోమీయులకు వ్రాసిన పత్రికలో మన నీతిగా గణించబడి కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రికలో మృతులలో నుండి లేచిన ప్రథమ ఫలముగాను, రెండవ పత్రికలో మన కోసం చేయబడిన పాపముగాను ఒప్పించి గలతీయులకు వ్రాసిన పత్రికలో ధర్మశాస్త్రమునకు సమాప్తిగా అంగీకరించబడినాడు.

అదే విధముగ ఎఫెసీయులకు వ్రాసిన పత్రికలో మన యుద్ధ కవచముగా పరిగణించబడి ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక ద్వారా మన ప్రతి అవసరమును తీర్చు దేవునిగ గుర్తించబడి కొలస్సయులకు వ్రాసిన పత్రిక నుండి అన్నిటికంటే పైగా నున్నవానిగా తెలుపబడి థెస్సలోనీకయులకు వ్రాసిన ఒక పత్రికలో తిరిగి వచ్చుచున్న ప్రభువుగాను రెండవ దానిలో కరుణా చిత్తుడయిన న్యాయాధిపతిగా లిఖించబడినాడు. మరియు తిమోతికి వ్రాసిన మొదటి పత్రికలో మన మధ్యవర్తి

(మిగత టైటిల్ 3వ పేజీలో )

(20వ పేజీ తరువాయి)

యని రెండవ పత్రికలో కిరీటముల ప్రధానకర్తయని విశదీకరించబడి తీతుకు వ్రాసిన పత్రికలో మన దేవుడు, రక్షణకర్తగా వ్రాయబడి ఫిలేమోనుకు వ్రాసిన పత్రిక నుద్దేశించి తండ్రితో పాలివానిగా రూపించబడినట్లు చెప్పవచ్చును. హెబ్రీయులకు వ్రాసిన పత్రికలోనయితే విశ్వాసులకు విశ్రాంతిగా, ధర్మశాస్త్రఛాయల నిజస్వరూపముగా చాటించబడి యాకోబు వ్రాసిన పత్రికలో జ్ఞానప్రదాతగా చూపబడి పేతురు వ్రాసిన మొదటి పత్రికలో పాత నిబంధన ప్రవచనముల సారాంశముగా వివరించబడి రెండవ పత్రికలోనయితే దీర్ఘశాంతముగల రక్షకునిగా వ్యాఖ్యానించబడెను.

యోహాను వ్రాసిన పత్రిక మొదటి దానిలో జీవ వాక్యముగాను, రెండవ దానిలో క్రీస్తు విరోధి యొక్క గురిగాను మరియు మూడవ పత్రికలో శరీరధారి యైన సత్యముగా అనుగ్రహింపబడినాడు. యూదా వ్రాసిన పత్రికలోనయితే విశ్వాసి యొక్క నిరీక్షణగా ప్రకటించబడి చివరగా ప్రకటన గ్రంధములో విజేయుడైన దేవుని గొఱ్ఱెపిల్లగా వివరించబడినాడు.

ఆయనను గూర్చి నేటి మానవులేమని చెప్పుకొన్నను మత్తయి 16:15లో పేతురు అంగీకరించిన విధముగా సజీవుడైన దేవుని కుమారుడని మనము ఒప్పుకోవాలి. ఆపేరు కోసము యీ లోకములో ద్వేషించబడినను రక్షణార్థమై చివరివరకు (మత్తయి 10:22 ప్రకారం) తట్టుకొని సకలమనుష్యుల యెడల పౌలు వలె ఆయనకు సాధనముగా మారాలి (అపొ.కా. 22:15).

ఎస్. తిరుగుళ, చీపురుపల్లి

## గమనిక

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న
సత్యవాణి T.V కార్యక్రమములను
దిగువ సమయాల్లో తప్పక చూడండి

**ప్రతి ఆదివారం ఉదయం 6.30 గం॥కు రక్షణ ఛానల్**
**ప్రతి ఆదివారం సాయంత్రం 6:00 గం॥కు శుభవార్త ఛానల్**
**ప్రతి సోమవారం ఉదయం 6.00 గంటలకు శుభవార్త ఛానల్‌లో**
**ప్రతి బుధవారం ఉదయం 7:00 గంటలకు విస్సా ఛానల్‌లో**
**ప్రతి శనివారం ఉదయం 6.30 గం॥లకు రక్షణ ఛానల్**


**RNI Regd. No. 6997/98**
**Postal Regd. No. AP/KD-02/2009-2011**


**To**

From:

**SATYA VAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**


...at Satya Vani ... amurthy St. Kak